**ఆటా కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ**



# "రెండు గాజులు పది గ్రాములు ఆరువేల రూపాయలు"

-శాంతిప్రభాకర్

నేను ఒక పత్రికా విలేకరిగా పనిచేస్తున్నా. మా గ్రామంలోనూ, పక్క గ్రామాలలోనూ జరిగే వింతలు, విశేషాలు, వార్తలు సేకరించి మా పత్రికకు పంపిస్తాను. పత్రిక యాజమాన్యంవారు ఇచ్చే ప్రతిఫలంతో సంసారం నెట్టుకువస్తున్నా అడపాతడపా పత్రికకు ప్రకటనలు కూడా సేకరించి పంపిస్తూ వుంటా. అందువల్ల కొద్ది అదనపు సంపాదన కూడా లభిస్తుంది. ఏమైనా ఆదాయం, ఖర్చు రెండూ సమానంగా వుంటాయి. చిన్న సంసారం- నేను, నా భార్య, ఎనిమిది సంవత్సరాల నా ముద్దుల కూతురు, గౌతమి. గౌతమి నాకు ప్రాణంకంటే ఎక్కువ. ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదుతోంది. నా భార్య గౌరి నాకు అన్ని విషయాలలోనూ సహకరిస్తుంది. సాఫీగా రోజులు సాగిపోతున్నాయి.

గౌతమి పుట్టినరోజు దగ్గరకు వస్తోంది. గౌతమికి గత సంవత్సరం పుట్టినరోజు పండగనాడు వాగ్దానం చేసాను, వచ్చే సంవత్సరం పుట్టినరోజు కానుకగా బంగారు గాజులు చేయిస్తానని. నేను ఆ వాగ్దానాన్ని ఎల్లా మరిచిపోతాను? సంవత్సరంనుండి ఒక జత బంగారు గాజులు చేయించడానికి అవసరమయ్యే డబ్బు సమకూర్చుకోడానికి చేసిన ప్రయత్నాలు దాదాపు ఫలించాయి అనే చెప్పాలి. కాని ఇంకా కొద్ది మొత్తం సమకూడాలి. నేను నా ఆదాయం పెంచుకోడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నా కాని ఆ మొత్తం సమకూడాలంటే ఏ ఒక పెద్ద ప్రకటనైనా సేకరించాలి. అప్పుడే సునాయాసంగా నా పని నెరవేరుతుంది. అదే ప్రయత్నంలో రోజూ నాకు పరిచయంవున్న వ్యక్తులను కలుసుకొంటున్నాను; ప్రభుత్వ సంస్థలు, విద్యాసంస్థలు ప్రకటనలు ఇస్తాయని ఆ సంస్థల అధిపతులనందరిని కలుసుకొంటూ నా ప్రయత్నం నేను చేస్తున్నా. చివరకు నా ప్రయత్నాలు ఫలించాయి. ఈ గ్రామానికి దగ్గరలో వున్న బ్యాంకు మేనేజరుగారు నన్ను రమ్మని కబురుచేసారు. నేను సంతోషంతో వెంటనే వెళ్ళి ఆయనను కలుసుకున్నా. ఒక పెద్ద ప్రకటన వ్రాత ప్రతి నాకందిస్తూ "చూడు మిస్టర్ రాజూ! నీకు పెద్ద ఎడ్వర్టైజ్‌మెంట్ ఇచ్చి సహాయం చెయ్యాలని నాకు చాలాకాలం నుంచి అభిప్రాయం వుంది. అది ఇంత కాలానికి నెరవేరుతోంది. ఈ ప్రకటన వలన మీ పత్రికకు మంచి ఆదాయం వస్తుంది, నీకు మీ పత్రిక యాజమాన్యం చక్కని కమీషన్ ఇస్తుంది, మా పనీ నెరవేరుతుంది" అన్నాడు చిరునవ్వుతో.

నేను ఆ ప్రకటన వ్రాత ప్రతిని పరిశీలించా. ప్రకటన పెద్దదిగా వస్తుంది. పత్రికలో ఒక పూర్తి పేజీలో మూడొంతులు రావచ్చు. 'బంగారు నగల వేలం నోటీసు'. వ్యవసాయదారులు తమ పంటల నిమిత్తం బంగారు ఆభరణాలను కుదువపెట్టి బ్యాంకు ద్వారా రుణాలు తీసుకొంటారు. అవి సకాలంలో చెల్లించక పోతే నగలు వేలంవేసి బ్యాంకువారు తమకు రావలసిన అప్పు వసూలు చేసుకుంటారు. ఈ ప్రక్రియ అప్పుడప్పుడు జరుగుతూనే వుంటుంది. ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు పడకపోవడంచేత పంటలు పండక చిన్న, సన్నకారు రైతులు తమ రుణాలను చెల్లించి చాలామంది నగలను విడిపించుకోలేక

*నేను నా ఆదాయం పెంచుకోడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తున్నా కాని ఆ మొత్తం సమకూడాలంటే ఏ ఒక పెద్ద ప్రకటనైనా సేకరించాలి. అప్పుడే సునాయాసంగా నా పని నెరవేరుతుంది. అదే ప్రయత్నంలో రోజూ నాకు పరిచయంవున్న వ్యక్తులను కలుసుకొంటున్నాను.*

**రచయిత పరిచయం**



పూర్తిపేరు: యర్రమిల్లి ప్రభాకర రావు

జననం: 1946లో

స్వగ్రామం: తణుకు (ప.గో జిల్లా), ప్రస్తుత నివాసం విశాఖలో.

తల్లిదండ్రులు: కీ. శే. శ్రీమతి యర్రమిల్లి పరమేశ్వరి
కీ.శే. శ్రీ యర్రమిల్లి నరసింహారావు

రచనలకు ప్రేరణ: స్వాతంత్ర్య సమరయోధులు, ప్రఖ్యాత రచయిత. తెలుగు, ఆంగ్ల భాషల్లో గ్రంథాలు రచించిన తండ్రిగారు. సాహితీ అభిలాషిణి అయిన తల్లిగారు.

దాదాపు 25కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. అనేక వ్యాసాలు రచించాను. 2002 ఉగాది పోటీల సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్' మాస పత్రిక నిర్వహించిన నవలల పోటీలో 'సంధ్య' నవలకు ప్రథమ బహుమతి లభించింది. ఝాన్సీ రాణి, ఛత్రపతి శివాజీ, స్వామి వివేకానందం- జీవిత చరిత్రలు రచించాను. బిఎస్సీ (అగ్రి), ఎమ్మెస్సీ చదివాను. ఫొటోగ్రఫీ, గ్రంథ పఠనం, రచనా వ్యాసంగం, భారతీయ చరిత్ర, సంస్కృతి, చదరంగం, నాణేల సేకరణ, సామాజిక కార్యకలాపాలలో పాల్గొనడం. కొత్త ప్రదేశాలను దర్శించడం మనసుకు ఇష్టమైన కొన్ని విషయాలు. ఇండియన్ బ్యాంకులో సీనియర్ మేనేజర్‌గా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశాను.

అడ్రస్
యర్రమిల్లి ప్రభాకర రావు
45-43ఎ-11, ఫ్లాట్ నెం. 7, సాయి మోహన నిలయం,
శ్రీనివాస నగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం- 530016


పోయారు. అంచేత బ్యాంకు వాళ్ళు ఈ చర్య తీసుకొంటున్నారు. బ్యాంకు మేనేజరు మాత్రం ఏంచేస్తారు? బ్యాంకు, పై అధికారులు విధించిన నిబంధనల ప్రకారం నడచుకోవాలి కదా! నా మనస్సులో చెలరేగిన ఆలోచనలకు ఆనకట్ట కట్టి నేను మళ్లీ ఒకసారి ప్రకటనను చూసాను. "పరవాలేదు- నాకు కావలసిన సొమ్ము కంటె ఎక్కువే వస్తుంది. సకాలానికి భగవంతుడు నామీద దయ చూపెట్టాడు. ఈ అవకాశం రాకపోతే నావద్ద ప్రస్తుతం వున్న సొమ్ముకు కావలసిన గాజులు రావు కదా! గౌతమికి గాజులు ఎల్లా చేయిస్తా?" అనుకున్నాను మనస్సులో.

"ప్రకటన ఎప్పుడు రావాలి సార్!".

"ఒక పదిరోజులలో ఎప్పుడు వచ్చినా పరవాలేదు" ఎంత త్వరగా వస్తే నీకు అంత మంచిది కదా? డబ్బు నీకు వస్తుంది"అన్నారు మేనేజర్.

నేను కూడా అదే అభిప్రాయంలో వున్నా. బ్యాంకు వారు బిల్లు సెటిల్‌చెయ్యడంలో ఆలస్యం వుండదు. కాబట్టి నాకు అవసరానికి ముందే డబ్బు పత్రిక వారు కూడా ఇచ్చేస్తారు. మంచి అవకాశం వచ్చింది అనుకొంటూ "థేంక్స్ సర్! రేపు నేను మిమ్మల్ని కలుసుకొని ఏ రోజు పేపరులో వచ్చేది తెలియచేస్తా"అంటూ కుర్చీలోంచి పైకి లేచాను, ప్రకటన ముసాయిదా బేగ్‌లో పెట్టుకుంటూ-

* * *

నేను యింటికి వచ్చేటప్పటికి సాయంకాలం నాలుగు గంటల సమయం. ఇంటిముందర వున్న ఖాళీ స్థలంలో నా కూతురు గౌతమి, ఆమె స్నేహితురాలు స్వప్న ఆడుకొంటున్నారు. స్వప్న నా కూతురు స్కూల్‌లోనే చదువుతోంది. ఇద్దరిదీ ఒకే తరగతి. సమవయస్కులు- ఏ పని చేసినా కలిసి చేస్తారు- కలిసి స్కూల్‌కు వెళతారు, వస్తారు, కలిసే పుస్తకాలకి అట్టలు వేసుకుంటారు, ఆడుకుంటారు. భోజనం చేసే సమయం, నిద్రపోయే సమయం తప్పిస్తే మిగిలిన రోజంతా వాళ్ళిద్దరినీ కలిపే చూస్తారు ఎవరైనా.

స్వప్నది కూడా మా అమ్మాయి లాగా ఆకర్షణీయమైన మోము, కను, ముక్కు తీరు ముచ్చటగా వుంటాయి. నల్లని జుట్టు, ఆ వయసుకు పొడవైన జుట్టు, ఎప్పుడూ రెండు జడలు వేసుకొని వుంటుంది. పావడా, జాకెట్టు, పాత బట్టలు ధరించినా చూడడానికి ముద్దు కలిగిస్తూ వుంటుంది. ఆమె తల్లిదండ్రులకు కూడా ఆ అమ్మాయి ఒక్కతే సంతానం. నాకు కూడా ఆ అమ్మాయి అంటే ఇష్టం.

నేను రావడం పిల్లలిద్దరూ గమనించలేదు. వాళ్ల ఆటపాటలలో నిమగ్నులయ్యారు- సాయంసంధ్యా సూర్యుడు తన బంగారు కిరణాలను వాళ్ళిద్దరి ముఖ బింబాలపై ప్రసరింపచేస్తున్నాడు. చెట్ల ఆకుల మధ్య నుండి ఆ కిరణాలు వాళ్ళ ముఖాలపై పడి నాట్యం చేస్తున్నాయి, రంగురంగుల కాంతులు విరజిమ్ముతున్నాయి, పరావర్తనం చెందుతున్నాయి. వాళ్ల లేత పెదవులపైనుండి వస్తున్న నవ్వులు వికసిస్తున్న నవ్వుల హారాలలా అనిపిస్తున్నాయి. వాళ్ల మాటల ధ్వని కలకూజితాల గానం కంటె కూడా మాధుర్యాన్ని వినిపిస్తోంది. ఆ దృశ్యం నాకు మనోహరంగా కనిపించింది. "సృష్టిలో తీయనిది స్నేహమేనోయీ"అన్న మధురమైన - ఇంద్రగంటి వారి నిర్వచనానికి సజీవ చిత్రంగా కనిపించారు పిల్లలిద్దరూ - నేను ఆనందంతో, సంతృప్తితో ఇంట్లోకి వెళ్ళిపోయాను వాళ్ళ ఆనందహేలని ఏమాత్రం భగ్నం చెయ్యకుండా, ఏమైనా నాది కవి హృదయం కదా!

* * *

సాయంకాలం ఆరుగంటలు దాటింది. నాకు మంచి ప్రకటన దొరికింది అని నా భార్యకు తెలిసింది, నేనే చెప్పాను. ఆమె కుతూహలం ఆపుకోలేక ఆ ప్రకటన చూస్తానని అడిగింది. మంచి ప్రకటన అంటే మా వ్యాపార సరళిలో నాకు ఎక్కువ కమీషన్ ఇచ్చే ప్రకటన అన్నమాట.

నా భార్య ప్రకటన చూసింది. తిరిగి బేగ్‌లో జాగ్రత్తగా మడిచిపెట్టేసింది. ఆమె ముఖంలో ఏమార్పులు లేవు, ఆమె ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఇంట్లోకి వెళ్ళిపోయింది. నేను కూడా ఆమె చర్యలకు ఏమీ ప్రాధాన్యం ఇయ్యలేదు. నేను వార్తాపత్రికకు వార్తలు వ్రాసుకునే పనిలో నిమగ్నమయ్యా.



**నా** భార్య ప్రకటన చూసింది. తిరిగి బేగ్‌లో జాగ్రత్తగా మడిచిపెట్టేసింది. ఆమె ముఖంలో ఏమార్పులు లేవు. ఆమె ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఇంట్లోకి వెళ్ళిపోయింది. నేను కూడా ఆమె చర్యలకు ఏమీ ప్రాధాన్యం ఇయ్యలేదు.

* * *

చీకటి పడింది. స్వప్న యింటికి వెళ్ళిపోయినట్లుంది, మా అమ్మాయి పరుగు పరుగున ఇంట్లో వాళ్ళమ్మ దగ్గరికి వెళ్ళింది, ఆరోజు ఆట విశేషాలు చెప్పడానికి, రోజూ కార్యక్రమంలో గౌతమి ముఖ్యమైన పనులలో ఇదొకటి.

మా అమ్మాయి, ఆమె తల్లి- మధ్య జరిగే సంభాషణ నాకు చాలా విచిత్రంగా అనిపిస్తూ వుంటుంది ఎప్పుడూ- ఎన్నో చిన్న చిన్న విషయాలు ఎంతో ప్రాధాన్యతవున్న ప్రపంచ విషయాలతో వాళ్ళు చర్చించుకొంటూ వుంటారు. మా అమ్మాయి చెప్పే విషయాలు తన స్కూలు గురించి, ఫ్రెండ్స్ గురించి, ఆటపాటల గురించి- మా ఆవిడ చెప్పే విషయాలు తానుచేసిన వంట గురించి, నీటి పంపు దగ్గర జరిగే దెబ్బలాటల గురించి, కిరాణాషాపు షావుకారు వస్తువులను తూచేటప్పుడు చేసే ఆలస్యం గురించి, చిల్లర డబ్బులు ఇచ్చేటప్పుడు చేసే పొరపాట్ల గురించి. వాళ్ళ యిద్దరి సంభాషణ నాకు ఎప్పుడూ చాలా ఆసక్తిని కలిగిస్తూ వుంటుంది. వాళ్ళు చర్చించే విషయాలలోని అప్రధాన్యత, అతి సామాన్యతలను నేను నాలోనే నవ్వుకొంటూ వుంటాను. ఈరోజు కూడా సంభాషణ అదే తీరులో సాగుతోంది.

* * *

"అమ్మా! నాకు గాజులు చేయిస్తున్నారా!" పుట్టినరోజుకి."

"నాన్న చేయిస్తున్నారు" డబ్బు కుదిరింది ఈరోజు కూడా ఏదో ప్రకటన దొరికింది."

"ఏదీ. నేను చూస్తాను."

"నాన్న బేగ్‌లో వుంది చూడు పరవాలేదు. జాగ్రత్తగా మళ్ళీ బేగ్‌లో పెట్టెయి."

కాసేపు ఇంట్లో నిశ్శబ్దం.

ఒక ఐదు నిమిషాల తరువాత.

"అమ్మా! నాకు గాజులు వద్దు. మళ్ళీ ఎప్పుడైనా చేయించుకోవచ్చు."

(మిగతా 12వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

"ఎందుకు తల్లీ!"

మళ్ళీ నాకు మాటలేమీ వినపడలేదు. సంభాషణ అతి నెమ్మదిగా సాగినట్లుంది.

"సరే నాన్నకు చెబుతాను."

"నాన్నకు నామీద కోపం వస్తుందేమో"...

"రాదు నేను చెబుతాను గదా"

"ఎప్పుడు?"

"రాత్రి భోజనం చేసేటప్పుడు." సంభాషణ ఆగిపోయింది.

* * *

రాత్రి ఎనిమిది గంటలైంది. నేను నా వ్రాత పని ముగించుకుని భోజనానికి కూర్చున్నా. గౌతమి భోజనంచేసి నిద్రపోతోంది.

"గౌతమి ఇందాక ఏదో చెబుతోంది..."

"దానికి గాజులు ఇప్పుడు అక్కర్లేదట- ఇంక ఎప్పుడైనా చేయించుకోవచ్చుట- ఈ ప్రకటన వాపసు ఇచ్చేయమని చెప్పింది. మీతో తనే స్వయంగా చెబుదామని అనుకొంది. కాని మీరేమైనా కోప్పడతారని భయంతో నన్ను చెప్పమంది."

నాకు ఏమీ అర్థంకాలేదు. "అసలు విషయం ఏమిటో"

"ప్రకటన ముసాయిదా చూసింది. అందులో మొదటి పేరు స్వప్న నాన్నగారి పేరు వేలానికి వచ్చిన వస్తువులు స్వప్న గాజులు... గౌరి ఇంకా ఏదో చెప్పబోతోంది. "ప్రకటనలోని మొదటి లైను "రెండు గాజులు... పది గ్రాములు... ఆరువేల రూపాయలు."

"ఇంక ఏమీ నాకు చెప్పనవసరం లేదు. నాకు విషయం పూర్తిగా తెలిసింది. గౌతమి అభిప్రాయం ప్రకారమే చేద్దాం. నీ ఉద్దేశ్యం ఏంటి?"

"నాకు వేరే అభిప్రాయం లేదు. గౌతమి ఇష్టానుసారమే చేద్దాం" ఈ లిస్టులో కొంతమంది స్త్రీల మంగళ సూత్రాలు, నానుతాడు వంటివి కూడా వున్నాయి. అవి కూడా వేలానికి వస్తున్నాయి. పిల్లల మురుగులు, గాజులే కాకుండా" అంది వ్యధాభరితంగా.

* * *

మరుసటిరోజు ఉదయం ఎనిమిది గంటలకే నేను స్వప్న వాళ్ళింటికి వెళ్ళాను. స్వప్న తండ్రి పొలం గట్టు మీద కూర్చున్నాడు. ఆ గట్టుమీదే చిన్న పూరిగుడిసె. అందులోనే అతని నివాసం.

నన్ను చూసి "నమస్తే సార్!"అన్నాడు లేచి నిల్చుని.

"కేశవా! ఏంటి స్వప్న గాజులు ఇంకా బ్యాంకులోనే వున్నాయా!" అని అడిగాను ఏ ఉపోద్ఘాతం లేకుండా అతనికి నాకు వున్న చనువు అటువంటిది.

"అవును సార్! రెండు సంవత్సరాల క్రితం పంట ఖర్చుల నిమిత్తం తీసుకున్నాను. ఇంకా గాజులు విడిపించలేదు. వర్షాలు లేక పంట రెండు సంవత్సరాల నించి వెయ్యలేదు. ఏదో కూలి, నాలి చేసుకుని బతుకుతున్నాం. ఈ సంవత్సరం వరుణదేవుడు దయచూపిస్తే వరి వేసి అప్పు తీర్చుదామని అనుకొన్నాను, జనవరిలో స్వప్న గాజులు విడిపిద్దామని అనుకొన్నా. ఇంతలో ఈ వేలం... బ్యాంకు మేనేజరు గారు మాత్రం ఏంచేస్తారు? చాలా వ్యవధి ఇచ్చారు. కాని సొమ్ము సమకూరలేదు..." స్వరం గద్గదమైంది.

నేను కేశవ్ వైపు చూసాను. అతడు తల ఎటో తిప్పి చూస్తున్నాడు. "బంగారంకోసం కాదు బాబూ. ఆలోచించేది, బాధ పడేది... వస్తువులు స్వప్నని..."

నేను పొలంవైపు చూసాను. నేల బీటలువారి, ఎండిపోయి వుంది. ఎక్కడా పచ్చగడ్డి పరక కూడా లేదు. వర్షాధారం భూమి అన్నమాట. ఆకాశంలో సూర్యుడు



"నాకు వేరే అభిప్రాయం లేదు. గౌతమి ఇష్టానుసారమే చేద్దాం" ఈ లిస్టులో కొంతమంది స్త్రీల మంగళ సూత్రాలు, నానుతాడు వంటివి కూడా వున్నాయి. అవి కూడా వేలానికి వస్తున్నాయి. పిల్లల మురుగులు, గాజులే కాకుండా" అంది వ్యధాభరితంగా.

ప్రచండంగా వున్నాడు. జ్యేష్ఠమాసం, వేడిగాలులు వీస్తున్నాయి. స్వప్న తల్లి గ్లాసులో మంచినీళ్ళు తెచ్చి యిచ్చింది.

"చల్లని మంచినీళ్ళు త్రాగండి బాబుగారూ..."

నేను మంచి నీళ్ళు త్రాగి "కేశవా నాతోరా, బ్యాంకుకు వెళదాం" అన్నాను.

"ఎందుకు బాబూ"

"ముందర నాతోటి వెంటనే రావాలి. అడ్డు ప్రశ్నలు వేయకు, చెప్పినట్లు చెయ్యి"అన్నాను ముందుకు దారి తీస్తూ.

* * *

ఉదయం పది గంటలు దాటింది. బ్యాంకులో ఎక్కువ జనం లేరు. అప్పుడే ఖాతాదార్లు వస్తున్నారు ఒక్కొక్కరే.

నన్ను చూసిన వెంటనే మేనేజరుగారు "రాజూ! రావయ్యా లోపలికి. పని ఎంతవరకు వచ్చింది?" అడిగారు.

నేను "చెబుతాను సార్! ముందర 'కేశవులు'లోను క్లోజు చేయించండి. డబ్బు తెచ్చాం"అన్నాడు.

మేనేజరు ఆశ్చర్యంగా "కేశవులూ... డబ్బు రాలేదని చెప్పావు ఇప్పుడు..." అంటున్నాడు.

"రాజు బాబు దయ సార్!"

మేనేజరుగారు ఏం మాట్లాడలేదు. ఆయన మొహంలో ఆనందం, ఆశ్చర్యం. పది నిమిషాలలో పని పూర్తయింది. చలానా రాయించి, డబ్బు కట్టేసా. మేనేజరు గారు గాజులున్న క్లాత్ బేగ్ చిన్నది కేశవుల చేతికి ఇచ్చారు.

కేశవులు దాన్ని వణుకుతున్న చేతులతో అందుకున్నాడు. అతని కళ్ళలో కన్నీరు.

"రాజు బాబు..."

నేను కేశవులు భుజంమీద చేయివేసి "కేశవా! నువ్వు ఇంక ఇంటికి వెళ్ళిపోవచ్చు. నేను కొద్దిగా పని చూసుకొని వస్తా" అన్నాడు.

కేశవులు మౌనంగా వెళ్ళిపోయాడు.

* * *

"ఇప్పుడు చెప్పండి. అసలు సంగతి ఏంటి" అడిగాడు మేనేజరు.

"ఏం లేదు సార్! ఈ గాజులు కేశవ్ కూతురు స్వప్నవి... స్వప్న, మా అమ్మాయి గౌతమి స్నేహితులు. మా అమ్మాయి ఇష్టప్రకారం ఈ పని చేసాను. కేశవ్‌కు డబ్బు వచ్చినప్పుడు మీకు తిరిగి ఇచ్చేస్తాడు. అంతే అంతకుమించి ఏమీలేదు"...

"మరి గౌతమికి గాజులు, పుట్టినరోజు పండగ. రేపు ఆదివారమే కదా?"...

"గౌతమి తనే చెప్పింది సార్! ఈ పుట్టిన రోజు పండగకి గాజులు అక్కర్లేదట- ముందర స్వప్న గాజులు విడిపించమని అప్పుడే తనకి సంతోషం అట. వాళ్ళ స్నేహం అటువంటిది. అందుకని గౌతమి గాజులకోసం జాగ్రత్త పరచిన డబ్బు, మా ఆవిడ ఇంటి ఖర్చులలో మిగిల్చిన మొత్తం కలిసి..." మేనేజరుగారు ఆశ్చర్యంగా నావైపు చూసారు.

"వెల్‌డన్! చాలా మంచిపని చేసారు మీరు రాజూ- గౌతమి హృదయం అమృతమయం..." ఇంకా ఏదో అంటున్నారు.

నేను "సార్! మీరు ఏమీ అనుకోకుండా వుంటే ఒక విషయం చెబుతాను. నేను ఈ ప్రకటన వేయించలేదు. మీరు ఇంకెవరికైనా యిచ్చి ఈ పని చేయించుకోండి. నన్ను క్షమించండి...." అంటూ ప్రకటన కాగితం టేబుల్ మీద పెట్టాను.

మేనేజర్ ఒక క్షణం ఆలోచించారు. "ప్రస్తుతానికి ఈ ప్రకటన మీరే కాదు, ఎవరూ వేయించనక్కర్లేదు. వేలం మరొక ఆరుమాసాలు వాయిదా వేస్తున్నా, పంటలు చేతికి అందిన తరువాత రైతులు తమతమ నగలు విడిపించుకొనేందుకు వీలుగా బ్యాంకు అధికారులకు ఈ విషయం ఇప్పుడే తెలియచేస్తా..."

"మీకు ఏమీ ప్రోబ్లంరాదా సార్!"

"ఫరవాలేదు- నేను మా అధికారులకు చెప్పుకుంటాను. బ్యాంకింగ్‌లో ఇటువంటి పరిస్థితులు వస్తూనే వుంటాయి. ఇంకా రాయితీలు చట్టపరంగా వీలుంటే ఏర్పాటు చేయిస్తా".

* * *

నాకు చాలా ఆనందం, గర్వం కల్గినాయి. నా చిన్ని తల్లి గౌతమి వలన చాలామంది రైతులకు ఆందోళన తగ్గింది. ఆదివారం ఉదయం వచ్చింది. గాయత్రి కొత్త బట్టలు కట్టుకొని వరండాలో స్వప్నతో స్కిప్పింగ్ చేస్తోంది. నేను పిల్లలవైపు చూసాను. స్వప్న చేతికి ఒక గాజు, మరి రెండవ చేతి గాజు? అది గౌతమి చేతికి అలంకరిస్తోంది స్వప్న. నా హృదయం ప్రేమాభిమానాలతో నిండిపోయింది ఆ పిల్లల్ని చూసి. అదే క్షణంలో ఆకాశం మేఘావృతమైంది. ఆకాశంలోనుంచి వరుణదేవుడు కూడా పిల్లల్ని ఆశీర్వదిస్తున్నాడా అన్నట్లు వర్షపు చినుకులు కురిపిస్తున్నాడు, అక్షింతలుగా.

★